A1TV NEWS

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 74 శుక్రవారం సెప్టెంబర్ 15- 2023 పేజీలు 4. వేల :4 /

- కుదిరితే బీజేపీ కూడా మాతో కలిసి వచ్చేందుకు ప్రయత్నం చేయాలి.
-పోత్తుపై నేడే కీలక నిర్ణయం తీసుకున్న.
- జగన్ కి ఆరు నెలల సమయం మాత్రమే ఉంది.
- జగన్మోహన్ రెడ్డి మద్దతు దారులు కూడా ఒకసారి ఆలోచించుకోండి.
- జగన్ నమ్ముకున్న వైసిపి నాయకులు ఒకసారి ఆలోచించండి.
-మీకు యుద్ధమే కావాలంటే నేను యుద్ధానికి సిద్ధం.
- ఏ ఒక్కరిని వదిలిపెట్టి ప్రసక్తే లేదు.
-జనసేన అధినేత పవన్ కళ్యాణ్.

4

## రాబోయే ఎన్నికల్లో

# జనసేన - టీడీపీ కలిసి పోటీ చేస్తాం.

ఆంధ్ర ప్రగతి రాజమండ్రి సెప్టెంబర్ 14: 2024 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన టిడిపి కలిసి పోటీ చేస్తాయని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. గురువారం నాడు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబుతో ములాఖత్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన కొనసాగుతోందని, అందులో భాగంగానే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్‌కు పంపించారని విమర్శించారు. ఆయనకు సంఘీభావం ప్రకటించడానికే రాజమహేంద్రవరం వచ్చినట్లు చెప్పారు. " చంద్రబాబుతో గతంలో విభేదించి సెపరేటుగా పోటీ చేశా. రాజకీయాల్లో జనసేన తరఫున నుంచి నేను తీసుకున్న నిర్ణయం రాష్ట్రం బాగుండాలని, దేశ సమగ్రత బలంగా ఉండాలనుకున్నా. జనసేన ఏర్పాటు చేసినప్పుడు కూడా అడ్డగోలుగా రాష్ట్ర విభజన జరిగిందని చెప్పాను. సగటు మనిషి ఆవేదన గురించి మాట్లాడాను. ఆరోజు నుంచి నేను తీసుకున్న నిర్ణయాలు చాలా మందికి ఇబ్బందిగా మారాయి" అని అన్నారు. జగన్ మద్దతుదారులకు ఇంకా 6 నెలలే సమయం ఉందని, వాళ్లు యుద్ధం కోరుకుంటే, వాళ్లకు యుద్ధమే ఇస్తామని అన్నారు. ఎవరినీ వదిలిపెట్టబోమని, ఇసుక దోపిడీ, మైనింగ్, బెల్ట్ షాపులు నిర్వహించిన వారందరినీ బయటకు తీసుకొస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా జనసేన-తెదేపా కలిసి పోటీ చేస్తాయని, భాజపా కూడా ఈ నిర్ణయానికి కలిసి వస్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు. జగన్ గురించి ప్రధానికి తెలియని విషయాలేవీ లేవని అన్నారు.






# నేడు నంద్యాల మెడికల్ కళాశాల ప్రారంభం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 14:

రాష్ట్రముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం నాడు వర్చువల్ గా నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించనున్నారు. 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల ఉండేలా చర్యలు తీసుకుంటామన్న ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. రాష్ట్రంలో మొత్తం రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం కోసం వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 15 శుక్రవారం నాడు ఒకేరోజు రాష్ట్రం లో 5 వైద్య కళాశాలల ప్రారంభోత్సవం ప్రారంభించనున్నారు.విజయనగరం లో ప్రత్యక్షంగా కళాశాల ప్రారంబిస్తుండగా నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం లో వర్చువల్ గా మెడికల్ కళాశాలలను ప్రారంభిస్తారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి అధ్యక్షతన నేడు ఘనంగా నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల వేడుకలు.నంద్యాలలో వైద్య కళాశాలను 50.93 ఎకరాల్లో రూ. 475 కోట్లతో నిర్మాణం. ఈ విద్యా సంవత్సరం (2023-24)నుండే నూతన వైద్య కళాశాలలో ప్రవేశాలు ప్రారంభించి 150 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేసి బోధనా తరగ తులు కూడా ప్రారంభం చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్సీపీ ప్రభుత్వం. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అన్ని అధునాత వసతులు కల్పించేలా జీ ప్లస్ 3 ఫ్లోర్లతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 3 మ్యూజి యమ్స్, 8 టీచింగ్ రూమ్లు, 8 లేబోరేటరీలు, 2 ఎగ్జామినేషన్ హాల్లు, 4 లెక్చరర్ హాల్లు తో పాటు రెసిడెన్షియల్, యూజీ హాస్టళ్లు, స్టాఫ్ అకా మిడేషన్, వర్కింగ్ స్టాఫ్, నర్సెస్ రూమ్స్, గెస్ట్ హౌ స్, స్టూడెంట్ నర్సెస్ హాస్టళ్లు, నర్సింగ్ కాలేజీ భవనం ఉంటుంది. హాస్టల్లో డైనింగ్ హాల్, సెంట్రల్ కిచెన్, లాండ్రీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్, బయోమెడికల్ వేస్ట్ రూమ్స్ ఏర్పాటు చేయనున్నారు.

# ఢిల్లీ బయలుదేరిన నారా లోకేష్.

-రాజమండ్రి నుండి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి నారా లోకేష్ .

-ఢిల్లీలో ఎవరెవరిని కలుస్తారో అనే దానిపై ఉత్కంఠ.



ఆంధ్ర ప్రగతి రాజమండ్రి సెప్టెంబర్ 14: టిడిపి జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమం అనే విషయంపై జాతీయస్థాయిలో మీడియాకు ప్రజెంటేషన్ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. మిగతాది 4లో...

# ఇక వార్ వన్ సైడే:

## -గంటా శ్రీనివాసరావు

- జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయన్న పవన్ కల్యాణ్- పవన్ సరైన నిర్ణయం తీసుకున్నారన్న గంటా
- తమ కూటమి ఘన విజయం సాధిస్తుందని ధీమా




వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయని జనసేనాని పవన్ కల్యాణ్ ఈరోజు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. రాజమండ్రి జైల్లో చంద్రబాబును కలిసిన అనంతరం ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ... పవన్ కల్యాణ్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. పవన్ కల్యాణ్ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వార్ వన్ సైడే అని అన్నారు. టీడీపీ, జనసేనలతో పాటు బీజేపీ కూడా కలిసివస్తే మరింత సంతోషమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధిస్తుందని, వైసీపీ సింగిల్ డిజిట్ కే పరిమితమవుతుందని జోస్యం చెప్పారు. వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకరని అన్నారు. జంతువులు సింగిల్ గా వస్తాయి, మనుషులు కలిసి వస్తారని పవన్ చక్కగా చెప్పారని వ్యాఖ్యానించారు.

## సనాతన ధర్మాన్ని తుడిచిపెట్టేయాలన్నది

# ఆ కూటమి పన్నాగం

## : ప్రధాని మోదీ

ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ ఆరోపణలతో విరుచుకుపడ్డారు. మధ్యప్రదేశ్ లోని సాగర్ జిల్లా బినాలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. స్వామి వివేకానంద, లోక మాన్య తిలక్ వంటి ఎంతో మంది గొప్పవారికి స్ఫూర్తినిచ్చిన 'సనాతన ధర్మాన్ని' తుడిచి పెట్టేయాలని ప్రతిపక్ష 'ఘమండియా' (అహంకారపూరిత) కూటమి నేతలు చూస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. "నేడు వారు బహిరంగంగానే సనాతన ధర్మంపై దాడికి దిగారు. రేపు మనపైనా దాడి చేస్తారు. దేశ్యాప్తంగా ఉన్న సనాతనులు అందరూ , ఈ దేశాన్ని ప్రేమించే వారు అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వారిని మనం నిలువరించాలి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై దురుసు వ్యాఖ్యలు చేయగా, దీన్ని కాంగ్రెస్ నేతలు సమర్థించడం తెలిసిందే.ఎలాంటి వాస్తవిక విజన్ లేకుండా, నాయకత్వం లేకుండా ఇండియా కూటమి విభజన రాజకీయాలను విజయవంతంగా నడిపిస్తోందని ప్రధాని విమర్శించారు. "దేశాన్ని, ఈ సమాజాన్ని విభజించడానికి కొన్ని గ్రూపులు పనిచేస్తున్నాయి. వారంతా కలసి 'ఇండియా కూటమి' ఏర్పాటు చేసుకున్నారు. భారత సంస్కృతిపై దాడి చేయడమే వారి రహస్య అజెండా" అని ప్రధాని విమర్శించారు. ఈ అమృత కాల దశలో ప్రతి భారతీయుడు.. భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. అందుకు గాను ఆత్మనిర్భర భారత్ గా మారాల్సిన అవసరం ఉందన్నారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించిన ఘనత 140 కోట్ల భారతీయులకే దక్కుతుందన్నారు. బినాలో బీపీసీఎల్ అతిపెద్ద పెట్రో కెమికల్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తుండగా, ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించేందుకు ప్రధాని రావడం గమనార్హం. ఈ పెట్రోకెమికల్స్ కాంప్లెక్స్ తో బినా ప్రాంతం మరింత అభివృద్ధి చెందుంతుందని ప్రధాని పేర్కొన్నారు.



# వినాయక విగ్రహాలు ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహించేవారు ఈ నియమాలు పాటించాలి.

## -నంద్యాల జిల్లా ఎస్పీకె .రఘువీర్ రెడ్డి




ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 14:
వినాయక చవితి పండుగ సందర్భంగా పందిరి/మండపాలు ఏర్పాటు చేసుకోదలచిన వారు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. వినాయక చవితి సందర్భంగా మండపం వద్ద పాటించవలసిన నియమ నిబంధనలు మరియు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు,18వ తేదీ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో పందిళ్ళు / మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహించదలచిన వారు తప్పని సరిగా ముందస్తు పోలీసు అనుమతి పొంది ఈ క్రింద తెలిపిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించి ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని నంద్యాల జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.
వినాయక "విగ్రహ ప్రతిష్ఠ పందిళ్ళు/మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్ లలో తెలిపి, వారి గుర్తింపు కార్డు నకలు కాపీలు పోలీస్ వారికి చూపించి అనుమతి పొందవలెను.ప్రైవేట్ లేదా పంచాయతీ/మున్సిపాలిటీ కి సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా సదరు ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి పందిళ్ళు / మండపాలు వద్ద ఇసుక మరియు నీళ్ళను ఏర్పాటు చేసుకుని తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాలలో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రతలు తీసుకోవాలి. విద్యుత్ వైర్లను మరియు ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో జాగ్రతలు వహించాలి. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలి.విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం మరియు విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలి.పందిళ్ళు/మండపాలు వద్ద శబ్ధకాలుష్య క్రమబద్దీకరణ మరియు నియంత్రణ నింబంధనలు-2000 ప్రకారం రెసిడెన్సియల్ ఏరియా నందు పగలు 55, రాత్రి 45 డెసిబల్స్ కు మించకుండా ఉండే విధంగా స్పీకర్లను ఉపయోగించాలి. ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలి.లౌడ్ స్పీకర్లను సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మరియు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ఎటువంటి స్పీకర్లను ఎట్టిపరిస్థితులలోను ఉపయోగించరాదు.భద్రత కొరకు రాత్రి సమయాల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతినిధులు కాపలా ఉండవలెను. ఎవరికి వారు తగు భద్రతా ఏర్పాట్లు చేసుకొనవలెను. రాత్రి సమయాలలో పందిళ్ళు/మండపాలు లో డబ్బులు, బంగారం లాంటి విలువైన వస్తువులు ఉంచరాదు. వినాయక పందిళ్ళు గాని, విగ్రహం పెట్టే ప్రదేశం గాని రోడ్డుపైన ఉండరాదు. బ్యానర్లు కాని, ప్లెక్సీలు గాని రోడ్డుపైన రాకపోకలకు అంతరాయంగా పెట్టరాదు. వినాయక పందిళ్ళ వలన ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బంది ప్రజలకు కలిగించరాదు. ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయరాదు. ఆ విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో రంగులు చల్లడం, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం, మందుగుండు సామాగ్రిని పేల్చడం చేయరాదు. ఊరేగింపు సమయంలో పోలీస్ వారి అనుమతి లేకుండా ఎక్కువ శబ్ధము వచ్చే వాయిద్యాలు అనగా డి.జే. మొదలుగునవి అనుమతించరాదు.పందిళ్ళ వద్ద మరియు ఊరేగింపు సమయాలలో అనుచిత ప్రదర్శనలు, అసభ్య నాట్య ప్రదర్శనలు జరుగకుండా మరియు మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన వారు లేకుండా ఉండే విధంగా ఉత్సవ నిర్వాహకులు బాధ్యత వహించాలి. నిమజ్జనానికి వెళ్లే వాహనం పై మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన వారు మరియు మైనర్ లు ఉండరాదు.వినాయక ఉత్సవ కమిటీ మెంబర్లు నిమజ్జనానికి ఉపయోగించే వాహనం యొక్క పరిస్థితిని గమనించి మంచి కండిషన్లో ఉండే బండిని మరియు లైసెన్స్ ఉన్న మరియు అనుభవం ఉన్న డ్రైవర్లను ఉపయోగించండి.గణేష్ ఉత్సవ కమిటీ మెంబర్లకు విజ్ఞప్తి మీరు గణేష్ నిమజ్జనానికి వెళ్లేటప్పుడు మీ యొక్క విగ్రహం నిమజ్జనానికి చిన్న పిల్లలను తీసుకెళ్లకండి. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా రద్దీని నివారించేందుకు ఉత్సవ నిర్వాహకులు చూసుకోవాలి.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా అర్జీదారుడు మరియు కార్యనిర్వాహకులే బాధ్యత వహించవలసి ఉంటుంది.
పండుగ రోజు నుండి నిమర్జనం వరకు జరిగే పూజలు, వేడుకల సందర్భాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ప్రజలందరూ వినాయక చవితి పండుగను జరుపుకోవాలని ఉద్దేశంతో ముందస్తు చర్యలలో భాగంగా పై నియమ నిబంధనలు సూచించామని వాటిని వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే నిర్వాహకులు లేదా కమిటీ సభ్యులు తప్పనిసరిగా పాటించాలని ఏదైనా అవాంఛనీయ సంఘటనలో తలెత్తితే పూర్తి బాధ్యత నిర్వాహకులు లేదా కమిటీ సభ్యుల పైన ఉంటుందని, కావున వినాయక విగ్రహం ఏర్పాటు చేసిన నిర్వాహకులే తగిన భద్రతా ఏర్పాట్లు చూసుకోవాలని ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగే అవకాశం ఉంటే ముందుగానే సంబంధిత పోలీస్ అధికారులకు తెలియపరచాలని నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ప్రజలకు సూచించారు.

# వైయస్సార్ ప్రభుత్వంలో ప్రతి గడపలో సంక్షేమం...

## ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 14:
నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఎస్బిఐ కాలనీలో కౌన్సిలర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో 147వ రోజు శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్ఎ శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఆలయంలో ఎంఎల్ఎ శిల్పా రవి రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లిన ఎంఎల్ఎ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వారికి అందచేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఎల్ఎ శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 16వ వార్డు ఎస్బిఐ కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు తెలిపిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అర్జీ స్వీకరించిన అనంతరం ఆ సమస్య అక్కడికక్కడే పరిష్కారం అయ్యే విధంగా అధికారులను ఆదేశించామన్నారు అలాగే కుల మత పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు ప్రజల కష్టాలను గుర్తించిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని నెరవేర్చిన మంచి మనసున్న వ్యక్తిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరం, మాజీ కౌన్సిలర్ చింత శ్రీనివాస్, వాసగిరి రమేష్ ,వాసగిరి సుధాకర్, టైలర్ శివ, పరమేశ్వర రాజశేఖర్, శంకర్ నాయక్, ఆర్ వి సుబ్బారెడ్డి, సుధాకర్, బోయ సుబ్బరాయుడు, రామచంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి, గిరి, మరియు వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ వార్డు ఇన్చార్జిలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# చంద్రబాబు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించిన ఆళ్ళగడ్డ జనసేన నాయకులు మైలేరి మల్లయ్య.

ఆంధ్ర ప్రగతి ఆళ్ళగడ్డ సెప్టెంబర్ 14 :
మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ నిరసన దీక్షకు సంఘీభావం తెలిపిన ఆళ్ళగడ్డ జనసేన నాయకులు మైలేరి మల్లయ్య.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు వెంకటసుబ్బయ్య ,మహబూబ్ దౌలా, నరేంద్ర యాదవ్, మాబు హుస్సేన్, ఆంజనేయులు, కుమార్, అశోక్, మహబూబ్ బాషా, తిమ్మరాజు యాదవ్, వెంకటసుబ్బయ్య, సురేంద్ర, జమాల్ బాషా, సుబ్బయ్య, విజయ్, సుబ్బరాయుడు, హుస్సేన్ వలి, కేశవ, కరుణాకర్, జగదీష్, ప్రసాద్ రవి, రాజారాం, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగా జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 14:
ఈరోజు సెట్కూరు - యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు / సాంస్కృతిక పోటీలు నిర్వహించడమైనది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా !! శశికళ మాట్లాడుతూ యువత విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడ ప్రతిభ చాటాలని తెలిపారు. తదుపరి డా!! రవి కృష్ణ, నంద్యాల కళారాధన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జాతీయ యువజనోత్సవాలలో భాగంగా యువ కళాకారుల ప్రతిభ ను వెలికితీయడానికి సాంస్కృతిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని మన నంద్యాల జిల్లా నుండి చాలా మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే విజేతలకు తమ కళారాధన తరుపున తోడ్పాటును అందిస్తామని తెలిపారు. తదుపరి శ్రీ పి.వి.రమణ సీఈఓ సెట్కూరు మాట్లాడుతూ నిత్యం చదువుకోవడంలో నిమగ్నమయ్యే యువతను సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించడానికి, ప్రతిభను ప్రదర్శించడానికి జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో యువజనోత్సవాల రూపంలో వారికి వేదికను అందించడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజనోత్సవాలు నిర్వహించబడుతాయని ఇందులో జిల్లాయువత ప్రతిభ కనబరచాలని కోరారు. ఈ సాంస్కృతిక పోటీల విజేతలు
జానపద నృత్యం (గ్రూప్) 1) గాయత్రీ గ్రూప్, ఆర్.జి.యం ఇంజనీరింగ్ కళాశాల, 2) గిరి ప్రసాద్ గ్రూప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల
జానపద నృత్యం (సోలో 1) సాయి కృష్ణ 2) యం.విజయ బాబు
జానపద గీతం ( గ్రూప్) 1) మానస గ్రూప్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల 2) సోఫియా గ్రూప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల
జానపద గీతం (సోలో) 1) షైక్ హీనా, 2) ఎల్.భరత్
పోస్టర్ మేకింగ్ : 1) షైక్ సమీర్ 2) కె.రవి తేజ
ఫోటోగ్రఫీ 1) జి. తేజస్విని 2) యన్.సాయి దినేష్
కథా రచన : 1) ఎస్.బాలాజీ 2) ఎస్.నూర్ మహమ్మద్
ఈ కార్యక్రమంలో సెట్కూరు మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ నెల 15 వ తేదీ ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డే.

## -జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్

ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 14:
ప్రభుత్వ ఉత్తర్వుల నెం.1233 లోని ఆదేశాల మేరకు నెలలో ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే లో భాగంగా ఈ నెల 15 వ తేదీ కలెక్టరేట్ లో ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు, దరఖాస్తులతో ఈనెల 15వ తేదీ ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 1-30 వరకు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఉద్యోగి తన దరఖాస్తులో సిఎఫ్ఎంఎస్ ఐడి తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ సూచించారు.ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉద్యోగుల గ్రీవెన్స్ డేను నిర్వహిస్తోందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# ఓర్వకల్లు హైవే లో కర్నూలు వైపు బస్ స్టాండ్ నిర్మాణం చేపట్టాలి.

ఆంధ్ర ప్రగతి ఓర్వకల్లు సెప్టెంబర్ 14: గురువారం నాడు ఓర్వకల్లు మండలం లో స్పెషల్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన హాజరయ్యారు, వారికి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఓర్వకల్లు నన్నూరు గ్రామ సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బి నాగన్న డివైఎఫ్ఐ నాయకులు మహేష్ మాసుం భాష పాల్గొన్నారు వారు మాట్లాడుతూ ఓర్వకల్లు మండల కేంద్రంలో హైవే ఏర్పాటు చేసి ఇన్ని సంవత్సరాలు అయినా బస్ స్టాండ్ నిర్మించడంలో హైవే అథారిటీ వారు తీవ్రంగా విఫలం చెందారని విమర్శించారు అంతేకాకుండా హైవేకు ఇరువైపులా కర్నూలు వైపు సర్వీస్ రోడ్డును వేయకుండా వదిలేశారు దీనివల్ల వందలాది మంది ప్రజలు విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాలు అనేక కాలనీలకు వెళ్లేవారు ఎప్పుడు ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందోనని ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికే పదుల సంఖ్యలో సర్వీస్ రోడ్డు లేక నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు ప్రజలు ప్రాణాలు కోల్పోయారని అయినా ఉన్నతాధికారులు ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు అంతేకాకుండా ఓర్వకల్లు పాత గ్రామం నుండి బైరెడ్డి కాలనీకి వెళ్లే రోడ్డుపై కుందూ నది పైన బ్రిడ్జి తగ్గులో ఉండడంతో ప్రజలు విద్యార్థులు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు కనుక తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టి ఇరువైపులా సర్వీసు రోడ్డును ఏర్పాటు చేసి ఓర్వకల్లు పాత గ్రామం




నుండి బైరెడ్డి కాలనీ కి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జిని హైట్ పెంచి ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో శ్రీరాములు ఆకుల మధు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్మెంట్ పేరుతో ఏపీ ఖజానాను దోచేశారు.

**- ఏఏజీ పొన్నవోలు సుధాకర్**

ఆంధ్ర ప్రగతి తాడేపల్లి సెప్టెంబర్ 14:
ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో ప్రభుత్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డితో కలిసి ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ. 371 కోట్ల అవినీతి స్కిల్ ఫుల్‌గా జరిపించి.. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి లూటీ చేశారని ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ స్కామ్‌లో మొత్తం 10 కీలక? అంశాలు ఉన్నాయని సీఐడీ చీఫ్ సంజయ్ వెల్లడించారు. "సీమెన్స్ ఏజీ అనే జర్మన్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ మీద ప్రేమతో.. రూ.3300 కోట్లు ఫ్రీగా సీమెన్స్ ఇస్తుంది అని చెప్పారు. ప్రభుత్వం కేవలం 10శాతం ఇస్తే సరిపోతుందన్నారు. ఎక్కడా కూడా గ్రాంట్ ఇన్ ఎయిడ్ పెడతామని చెప్పాలేదు. కేబినేట్ అనుమతి లేకుండా కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఏపీ ఖజానా నుంచి రూ.371కోట్లు డిజైన్ టెక్ కు నిధులు చెల్లించారు. అధికారుల ఆభ్యంతరాలను నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయాలన్న అధికారుల వాదనను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టించుకోలేదు"- ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి

జీవోలో ఉన్న అంశాలు అగ్రిమెంట్ లో లేవు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో జీవో కంటే ముందే అగ్రిమెంట్ తయారీ అయ్యిందని, తప్పుడు పత్రాలతో ఒప్పందాలు చేశారని సీఐడీ చీఫ్ సంజయ్ తెలిపారు అగ్రిమెంట్‌లో జీవో నెంబర్‌ను చూపించలేదని జీవోలో ఉన్న అంశాలు అగ్రిమెంట్‌లో లేవని పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్ల అవినీతి జరగిందని, నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లను రిలీజ్ చేశారని చెప్పారు. తప్పుడు డాక్యుమెంట్స్‌తో ఒప్పందాలు చేసుకున్నారని, ప్రభుత్వ జీవోలకు, అగ్రిమెంట్‌కు చాలా తేడాలు ఉన్నాయని అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటులోనూ విధి విధానాలు పాటించలేదని, కార్పొరేషన్ నుంచి ప్రైవేటు వ్యక్తులకు డబ్బులు వెళ్లాయని ఆ ప్రైవేట్ వ్యక్తుల నుంచి షెల్ కంపెనీలకు మళ్లాయని వివరించారు.

చంద్రబాబు నాయుడు హయాంలో ఏర్పాటైన స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అవకతవకల



గురించి మొదట పుణే నుంచి జీఎస్టీ అధికారులు గుర్తించి అప్పటి ఏపీ ప్రభుత్వానికి లేఖ ద్వారా అప్రమత్తం చేశారని ఏఏజీ పేర్కొన్నారు. 2018, మే 14వ తేదీన ఏపీ ఏసీబీ డీజీకి లేఖ రాశారని, అందులో రూ.371 కోట్లు నిధులు చేతులు మారాయని ప్రభుత్వాన్ని అలర్ట్ చేసినట్లు స్పష్టంగా ఉందని తెలిపారు. స్కాం కారకులనే పుణే జీఎస్టీ విభాగం అప్రమత్తం చేసిందన్న విషయం గమనించాలని అన్నారు. అందుకే వ్యవహారం ముందుకు సాగలేదని ఏఏజీ సుధాకర్‌రెడ్డి వివరించారు. వేరువేరు శాఖల ఫేక్ ఇన్వాయిస్ ద్వార నల్ల డబ్బు తెల్ల డబ్బుగా మార్చిన పీఏ, ఆయన అకౌంట్లో నుంచి చంద్రబాబు అకౌంట్లోకి నిధులు జమ అయ్యినట్లు ఆధారాలు దొరికాయని తెలిపారు.




## బాల అకాడమీ పాఠశాలలో ఘనంగా జరిగిన హిందీ భాషా దినోత్సవపు వేడుకలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 14:
నంద్యాల జిల్లాలోని పార్క్ రోడ్ సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో 14వ తేదీ అనగా గురువారం హిందీ భాషా దినోత్సవపు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ శ్రీ యం.జి.వి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ శ్రీ మతి మాధవీలత మరియు ముఖ్య అతిథిగా శ్రీ శ్రీకాంత్ రెడ్డి(హిందీ పండిట్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ హిందీ భాషా దినోత్సవంను ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14 న జరుపుకుంటారు. భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాషా ఆనాడు దోహదపడినందున గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబర్ 14వ రాజ్యాంగంలోని 351వ అధికరణం 8వ షెడ్యూల్ లో హిందీని కేంద్రప్రభుత్వం అధికారభాషగా గుర్తిస్తూ పొందుపరిచారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఈ రోజున హిందీ భాషా దినోత్సవమును జరుపుకుంటారు అని విద్యార్థులకు అర్థమయ్యేలాగ వివరించడం జరిగినది. ఈ కార్యక్రమములో పాఠశాల కరస్పాండెంట్ శ్రీ యం.జి.వి.రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ మాధవీలత మరియు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులందరు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పోస్ట్ కార్డ్, చార్జి సీట్ విడుదల చేసిన నాయకులు

(కంగ్టి సెప్టెంబర్,14 )
సంగారెడ్డి జిల్లా, నారాయణఖే నియోజకవర్గం, కంగ్టి పరిధిలో దామరగిద్ద పంచ మహాల్ దొంగ బాన్సువాడ లో పోస్ట్ కార్డ్, చార్జి సీట్ విడుదల చేయడం జరిగింది పీసీసీ పిలుపు మేరకు పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ సురేష్ షేట్కార్,పీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు
నారాయణఖేడ్ నియోజికవర్గం కంగ్టి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ప్రెసిడెంట్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో దొంగ,బాన్సువాడ, దామరగిద్ద పంచ మహాల్, , గ్రామానికి చెందిన బూత్ ఏజెంట్ లను ఎన్నుకున్నారు.అనంతరం ,పోస్ట్ కార్డ్, ఛార్జి షిట్ పత్రాలను గ్రామ కాంగ్రెస్ నాయకులకు అందించారు ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు మల్లారెడ్డి పటేల్,మురళి పాటిల్,గోపాల,సతీష్,బీమా ఎన్.భాస్కర్,,సాయిలు,పాల్గొన్నారు






# యోగా పోటీల్లో అబ్బుర పరిచిన సల్లే పల్లే లావణ్య.

ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ సెప్టెంబర్ 14 : శిరివెళ్ల మండలం రాజానగరం గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ గురువారం జరిగిన పాఠశాల క్రీడా పోటీల్లో సలోపల్లి లావణ్య రెడ్డి యోగ ఆసనాలలో సరికొత్త రికార్డును సృష్టించారు. శిరివెళ్ల వార్తా విలేకరి సల్లేపల్లి మల్లికార్జున రెడ్డి కూతురు స్తానిక కస్తూరిబా పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. విద్యతోపాటు క్రీడల్లో సైతం లావణ్య రెడ్డి సత్తా చాటుకుంటున్నారు. రాజనగరం గ్రామంలో జరిగిన యోగ ఆసనాల పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కారణంగా ఆళ్లగడ్డలో జరిగే పోటీలకు ఎంపిక కావడం జరిగిందని క్రీడా సెలక్షన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.సల్లేపల్లి లావణ్య రెడ్డి యోగ పోటీల్లో సత్తా చాటుకోవడం ఎట్లా పలువురు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.

# బొగ్గులైన్ గృహ నిర్వాసితులకు అండగా జనసేన పార్టీ.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 14:
గత 80 సంవత్సరాల నివాసముంటున్న నిర్వాసితుల గృహాలను అధికారులు అక్రమంగా తొలగిస్తున్నారని స్థానికులు వాపోయారు.అధికారుల అత్యుత్సాహం చూపుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గత కొన్ని ఏళ్లు గా పేదల ఆవాసాన్ని తక్షణమే ఖాళీ చేయాలంటే అధికారులు హెచ్చరించారు. పేద ప్రజలకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని జనసేన నాయకులు సుధాకర్ తెలిపారు.తక్షణమే నిర్వాసితులకు అన్ని సౌకర్యాలతో ఇళ్ల స్థలాలు కేటాయించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి స్పందించి గుడిసెలలో నివసిస్తున్న వారికి స్థలాలు, అన్ని వసతులతో కూడిన ఇళ్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నీ కోరిన జనసేన నాయకుడు సుధాకర్.



## చంద్రబాబు అరెస్ట్ కు నిరసనగా భూమా ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు.

**- 2వ రోజు దీక్షల్లో పాల్గొన్న మహిళలు**



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 14:
మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసనగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 2వ రోజుకు చేరుకున్నాయి. ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా సాగుతున్న దీక్షల్లో 2వ రోజు గురువారం పెద్ద సంఖ్యలో మహిళలు దీక్షలో పాల్గొన్నారు. కౌన్సిలర్లు దూదేకుల జైనాబి, చెరుకు శ్రీదేవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు గౌరు యాదవ్, నాసిరా, లక్ష్మిదేవి, భారతి, శ్రీదేవి, పిడతాల శశికళ, నాగరత్నమ్మ, రాజ్యలక్ష్మీ,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖలీల్, రాష్ట్ర కార్యదర్శి జిల్లేల్ల శ్రీరాములు, కౌన్సిలర్ల నాగార్జున, మాబువలి తదితర నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలిస్తే తెలుగుదేశం పార్టీ మహిళలకు పెద్ద ఎత్తున వరాలు ప్రకటించిందని, మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు, ఉచితంగా బస్సు ప్రయాణం తదితర పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం కావాలనే చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసిందని ఆరోపించారు.

## "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని నిర్వహించిన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

ఆంధ్ర ప్రగతి పాణ్యం సెప్టెంబర్ 14:
పాణ్యం ఎమ్యెల్యే మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు శ్రీ.కాటసాని రాంభూపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఈరోజు పాణ్యం నియోజకవర్గ పరిధిలోని,పాణ్యం మండలం:గగ్గుటూరు,కొత్తూరు గ్రామాలలో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఎమ్యెల్యే కాటసాని ఆ



గ్రామాలలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన,అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు.ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు ఎమ్యెల్యే శ్రీ.కాటసాని రాంభూపాల్ రెడ్డి.ఈ కార్యక్రమంలో...మాజీ జడ్పీటీసీ,ఎంపీపీ,సర్పంచులు, ఎంపిటిసిలు,పలువురు గ్రామ మరియు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటిరీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ కేవైసీ చేయించుకోవాలి.

**- నంద్యాల మండల వ్యసాయాధికారి ఇ.ప్రసాద రావు.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ సెప్టెంబర్ 14:
ఈ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు కూడా తమ గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ఈ ప్రసాదరావు తెలిపారు.
గురువారం నాడు భీమవరం మరియు ఉడుమాల్పురం గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించడం జరిగినది.అలాగే ఈ పంట సరిగా నమోదు చేశారో లేదో



తెలుసుకోవడానికి నంద్యాల మండల వ్యవసయాధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలించి (సూపర్ చెక్) చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించడం జరిగినది. ఇందులో బాగంగా ఈ రోజు భీమవరంలో మరియు ఉడుమాల్పురములో రైతులు వేసిన పంట, సర్వే నంబర్, నీటి వసతి, వాస్తవ సాగు దారిని వివరములు తనిఖీ చేయడము జరిగినది, ఇందులో అన్ని సర్వే నంబర్ లలో సరిగా పొందుపరచడం జరిగినది.కార్యక్రమములో బాగంగా రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల లభ్యత తనిఖీ చేసి రైతులు రైతు భరోసా కేంద్రాలలో నాణ్యమైన ఎరువులను వినియోగించుకోవాలని తెలియజేశారు.

# రాబోయే ఎన్నికల్లో జనసేన - టీడీపీ కలిసి పోటీ చేస్తాం.

అందుకే మోదీకి మద్దతిచ్చా

" నేను 2014లో నరేంద్రమోదీకి మద్దతు తెలిపిన సమయంలో ఆయన సొంత పార్టీ వ్యక్తులే ఆయన ప్రధాని కాకూడదని అనుకున్నారు. దక్షిణ భారతదేశం నుంచి నేను మోదీ మద్దతు తెలిపాను. ఈ రోజున నేను నా మనసును ఆవిష్కరిస్తున్నా. దేశానికి చాలా బలమైన నాయకుడు కావాలి. మా నాన్న అస్థికలు కాశీలో కలపడానికి వెళ్లినప్పుడు ముంబయిలో ఉగ్రవాదులు తాజ్ హోటల్‌పై దాడి జరిగింది. అంతకుముందు పార్లమెంటుపై దాడి జరిగింది. ఈ నేపథ్యంలో నరేంద్రమోదీకి మద్దతు తెలినప్పుడు చాలా మంది వ్యతిరేకించారు. ఆ రోజు నుంచి నరేంద్రమోదీ పిలిస్తే తప్ప నేను వెళ్లలేదు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగాలని 2014లో భాజపా, తెదేపాతో కలిసి పోటీ చేశాం. ఆంధ్రప్రదేశ్‌కు చాలా అనుభవం ఉన్న నాయకుడు కావాలని భావించా. 2020 విజన్ గురించి మాట్లాడినప్పుడు ఎవరికీ అర్థం కాలేదు. ఇవాళ లక్షలాది మాదాపూర్ వంటి ఐటీ ప్రాంతాల్లో ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. ఆయనతో ప్రత్యేక హోదా విషయంలో మాత్రమే విభేదించా. వ్యక్తిగతంగా ఏనాడూ విభేదించలేదు." అని పవన్ అన్నారు.

" రూ.300 కోట్ల స్కామ్ పేరు చెప్పి మాజీ సీఎంకు అవినీతి అంటగడుతున్నారు. గుజరాత్‌లో ప్రారంభమైన కంపెనీ కాంట్రాక్టు ఇచ్చారు. అది హార్డ్‌వేర్‌ను సప్లయ్ చేస్తుంది. ఏదైనా తప్పు జరిగితే అందుకు సంబంధించిన వ్యక్తులను విచారించాలి. అలాంటిది సైబరాబాద్ వంటి సిటీని నిర్మించిన వ్యక్తిని ఇలాంటి కేసులో ఇరికించడం బాధాకరం. ఈడీ విచారించాల్సిన ఇలాంటి కేసులను రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోకి తీసుకుంది. ఇలా చేయడం రాష్ట్రానికి మంచిది కాదు. పోనీ అభియోగాలు మోపిన వ్యక్తి ఏమైనా మహానుభావుడా. వాజ్‌పేయా? లాల్ బహదూర్ శాస్త్రినా? ఈడీ కేసులను ఎదుర్కొంటున్నాడు. దేశం విడిచి వెళ్లాలంటే కోర్టుల అనుమతి తీసుకుంటున్నాడు. రాజ్యాంగ ఉల్లంఘనలు చేసే వ్యక్తి. అందరినీ భయభ్రాంతులకు గురి చేసే వ్యక్తి"

–అడ్డగోలు దోపిడీ

"డేటా చౌర్యం జరుగుతోందని వాపోయిన వ్యక్తి ఇవాళ వాలంటీరు వ్యవస్థను అడ్డం పెట్టుకుని అదే పని చేస్తున్నాడు. అడ్డగోలు హామీలిచ్చి వేటినీ అమలు చేయలేదు. అడ్డగోలు దోపిడీ మాత్రమే చేస్తున్నారు. మద్యం విషయంలోనే కోట్లు జేబుల్లోకి వేసుకుంటున్నాడు. రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి ప్రశ్నించడానికే వీలులేకుండా పోయింది. ఎవరైనా ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్నారు. నాలాంటి వ్యక్తులను ఏపీ సరిహద్దుల్లో ఆపేస్తున్నారు. అలా ఆపే హక్కు ఎవరికీ లేదు. వ్యతిరేక ఓటు చీలనివ్వనని 2021లోనే చెప్పాను. దానికే 30 సంవత్సరాలు అధికారంలో ఉంటానని కలగన్న వ్యక్తిలో ఉలికిపాటు మొదలైంది. చంద్రబాబు భద్రత విషయాన్ని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తా." అని పవన్‌కల్యాణ్ అన్నారు.

–అందుకే లోకేశ్, బాలకృష్ణ పక్కన నిల్చున్నా.

సీఎం జగన్ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని పవన్ మండిపడ్డారు. అందుకే ఇవాళ లోకేశ్, బాలకృష్ణ పక్కన నిల్చున్నానని అన్నారు. " గుజరాత్‌లోని ముంద్రా పోర్టు మూడు వేల కేజీల హెరాయిన్ దొరికింది. దాని మూలాలు విజయవాడలోని ఆశి కంపెనీవని తేలాయి. మీడియాలో వార్తలే రాకుండా చేశారు. ఇవాళ చంద్రబాబుకు జరిగిందని కాదు, రేపు అందరికీ ఇలా జరిగే అవకాశం ఉంది. విశాఖలో నిరసన తెలిపినందుకే జనసేన నేతలపై కేసులు నమోదు చేశారు. చంద్రబాబు అరెస్టును సంపూర్ణంగా ఖండిస్తున్నా. వైకాపా దౌర్జన్యాన్ని అడ్డుకోవాలంటే విడివిడిగా పోటీ చేస్తే కుదరదు. ఈ అరాచకాలు దశాబ్దాలు కొనసాగుతాయి. అందుకే ఈ రోజు నిర్ణయం తీసుకున్నా. జనసేన–తెదేపా కలిసి వెళ్తాయి. ఇది మా భవిష్యత్ కోసం కాదు.. ఆంధ్ర ప్రదేశ్ భవిష్యత్ కోసం తీసుకున్న నిర్ణయం. బిల్ క్లింటన్ లాంటి వ్యక్తిని సైబరాబాద్‌కు తీసుకొచ్చిన వ్యక్తిని ఇవాళ రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉంచారు. ఆర్థిక నేరస్థుడైన జగన్ నేను కోనసీమ పర్యటనకు వెళ్తే 2వేల మంది క్రిమినల్స్‌ను దించాడు. ఏ ఒక్కరినీ వదలబోం. రాజకీయాల్లో పట్టు విడుపులు ఉండాలి. రాజశేఖర్‌రెడ్డి ఇలా వ్యవహరించలేదు. చంద్రబాబులాగే రేపు ఉన్నతాధికారులందరినీ కేసుల్లో ఇరికించే విధానాలను జగన్ తీసుకొచ్చాడు. సొంత చెల్లిని, తల్లిని వదిలేసిన వ్యక్తి, బాబాయిని చంపించిన వ్యక్తిని అధికారులు నమ్ముకొంటున్నారు. రేపు మీకు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో ముందే ఆలోచించుకోండి." అని పవన్ హితవు పలికారు.

–సీట్ల విషయం తర్వాత మాట్లాడతా.

సీట్ల పంపకాల గురించి తర్వాత మాట్లాడతానని పవన్ తెలిపారు. జనసేన, తెదేపా శ్రేణులకు ఎన్నికలకు సిద్ధం చేస్తామన్నారు. " జనసేన ఒంటరిగా పోటీ చేయమని చెప్పడానికి వైకాపా నేతలకు ఏ హక్కు ఉంది. జగన్‌ను పులివెందుల కాదని, అమలాపురంలో పోటీ చేయమని నేను చెబుతున్నానా? చంద్రబాబు అరెస్టు అయ్యారని తెలిసి వైకాపా నేతలు సంబరాలు చేసుకున్నారు. ఒకరి చావు, అరెస్టు గురించి సంబరాలు చేసుకోవడం మంచి పద్ధతి కాదు. రాజశేఖర్‌రెడ్డి చనిపోయిన విషయం నాకు తెలియగానే చాలా బాధపడ్డాను" అని పవన్ అన్నారు.

# మట్టి గణపతే పర్యావరణహితుడు.




ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 14: నంద్యాల పట్టణంలోని బాల అకాడమీ రవీంద్ర పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకై బాల బాలికలచే మట్టి వినాయకుల ప్రతిమలను చేయించి, మట్టి వినాయకుల విశిష్టతను, పండుగ యొక్క సంస్కృతి సాంప్రదాయాలను పాఠశాల కరస్పాండెంట్, నంద్యాల జిల్లా శ్రీ గణేష్ మహోత్సవ్ కేంద్ర సమితి సెక్రెటరీ, ఎం జీవి రవీంద్రనాథ్ మరియు పాఠశాల ప్రిన్సిపల్ మాధవీ లత విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక చవితి పండుగ ఈనాటిది కాదు స్వాతంత్ర్యానికి పూర్వమే 1893లో బాలగంగాధర్ తిలక్ తలపెట్టిన మహా యజ్ఞమని ఈ పండుగ ద్వారా భారతీయులను నడిపించేందుకు చేసిన భృత్కార్యమే ఈ వినాయక చవితి.బాల అకాడమీ పాఠశాలలోని బచపన్ మొదటి విభాగం నుంచి హైదరాబాద్ గోగ్రీన్ సంస్థ ద్వార అభినవ్ సహకారంతో వినాయకుని మట్టి విగ్రహాలను తయారు చేయడం. ప్రారంభించడం జరిగింది. అప్పటి కమిషనర్ ఖాదర్ భాష మరియు గోగ్రీన్ వారితో కలిసి మొదటి సారిగా ర్యాలి చేయడం జరిగింది. ఈ మట్టి వినాయకుని గురించి అందరికి అవగాహనను తీసుకొనివచ్చిన మొదటి పాఠశాల బాల అకాడమీ. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరి కొన్ని పాఠశాలలు ముందుకు రావడం ఆనందకరమైన విషయం.వినాయకుని బొమ్మను మట్టితో చేయాలి అని శాస్త్రము చెపుతుంది. పర్యావరణమును ప్రేమించే వినాయకుడు కూడా తనను మట్టితో చేసేవారినే ఇష్టపడతాడు కావున ఈ పండుగ ఉత్సవంలో మట్టి విగ్రహాలనే వాడాలి. విగ్రహాల తయారీలో బంకమట్టిని ఉపయోగించి వినాయక ప్రతిమలను అందంగా తయారు చేస్తే అది పర్యావరణానికి మేలును చేకూరుస్తుందని అందుకే విద్యార్థులకు పోటీలను నిర్వహించడం జరుగుతుంది. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలు వాడడం వలన వాయు కాలుష్యం,జల కాలుష్యం, భూ కాలుష్యం, శబ్ద కాలుష్యం జరుగుతుందని కాబట్టి మట్టి విగ్రహాలనే ఉపయోగించాలి. ఈ పండుగను 3,5,9,11 రోజుల పాటు నిర్వహిస్తారు. పూజలో 21 రకాల పత్రాలతో పూజించడం చేత వైజ్ఞానికంగా కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని, భూమి, నీరు,నిప్పు,గాలి ఆకాశం వాటిని పంచభూతాలని, ఆ పంచభూతాల కలయికే ప్రకృతి అనే పర్యావరణం. అలాంటి పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది. భావితరాలకు మనం పర్యావరణ ధనాన్ని అందించి ప్రజలకు కూడా స్ఫూర్తి నింపాలని విద్యార్థులకు తెలియజేశారు.

మొదటిగా అంధ్రజ్యోతి సహకారంతో తర్వాత సొంతంగా మట్టి వినాయకుని విగ్రహాలను గత 17 సంవత్సరాల నుండి పంపిణి చేయడం జరుగుతున్నది. ప్రస్తుతము వెదుర్ల రామచంద్ర రావు ప్రముఖ సీనియర్ న్యాయవాది మమా శ్రేయోభిలాషితో కలిసి 6 వేల మట్టి వినాయకుని విగ్రహాలను ఆత్మకూర్ బస్టాండ్ నందు గల వరసిద్ధి వినాయకుని గుడి దగ్గర శనివారం పంపిణి చేయబడును. ఆదివారము టెక్కెలోని శ్రీ వీర ఆంజనేయ స్వామి గుడిలో వెదుర్ల రామచంద్ర రావు చే పంపిణి చేయబడును.

# ఢిల్లీ బయలుదేరిన నారా లోకేష్.

. ఏపీలో ఉన్న పరిస్థితులను జాతీయ స్థాయిలో తెలిసేలా వివరించాలని లోకేష్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గురువారం లోకేశ్ తల్లితో కలిసి ఢిల్లీకి వెళ్ళారు. ఈ అంశంపై జాతీయ మీడియాకు ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. చంద్రబాబు అరెస్ట్ విషయంలో జాతీయ స్థాయిలో స్పందన వచ్చింది. చంద్రబాబును రాజకీయకక్షతోనే అరెస్టు చేశారని అనేక పార్టీల నేతలు ఇప్పటికే ప్రకటించారు. జాతీయ మీడియా కూడా ఈ ఘటనపై విస్తృతంగా కవరేజీ ఇస్తోంది. దీంతో చంద్రబాబు మొత్తం ప్రజెంటేషన్ ఇవ్వాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి కాలంలో దాడులు చేసిన వారిని వదిలేసి బాధితులపైనే కేసులు పెడుతున్నారని టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. నాలుగేళ్ల కాలంలో ఎపిలో జరిగినన్ని అరాచకాలు దేశంలో ఎక్కడా జరిగి ఉండవని, వాటన్నింటినీ జాతీయ మీడియాకు వివరించాలని అనుకుంటున్నారు. టిడిపి ఆఫీసుపై దాడి చేసిన వారిపై ఒక్క కేసు కూడా పెట్టకపోవడం, అంగళ్లు, పుంగనూరులో చంద్రబాబు ర్యాలీపై రాళ్ల దాడులు చేసి తిరిగి చంద్రబాబుపైనే హత్యాయత్నం కేసులు నమోదు చేయడం వంటి వాటిని, లా అండ్ ఆర్డర్ పూర్తిగా దారి తప్పిన పరిస్థితులను జాతీయస్థాయిలో హైలెట్ చేయాలని లోకేష్ అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. ఆధారాలు లేని కేసులను ప్రతిపక్ష నేతలపై ఎలా మోపుతున్నారో వివరించనున్నట్లుగా చెబుతున్నారు. వ్యాపార సంస్థలపై ప్రభుత్వం జరిపినదాడులు, మార్గదర్శి వంటి సంస్థలు, అమరరాజా వంటి దేశానికి ప్రాముఖ్యత తెచ్చిన సంస్థలపై జరిగిన దాడుల గురించి మీడియాకు తెలిపి అరాచక పాలన గురించి వివరిస్తారని టిడిపి వర్గాలు చెబుతున్నాయి.

వ్యవస్థలను పూర్తి స్థాయిలో నాశనం చేసి న వైనాన్ని వివరించే అవకాశాలు ఉన్నాయి. 73 ఏళ్ల వయసులో ఉన్న చంద్రబాబును పధ్నాలుగేళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసినా ఎఫ్ఐఆర్ లో పేరు లేకుండా, గవర్నర్ అనుమతి లేకుండా, కనీసం నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేసిన వైనాన్ని జాతీయ స్థాయిలో చర్చకు పెట్టే అవకాశం ఉంది. వీలైతే హోంమంత్రి అమిత్ షాను కూడా కలుస్తారని విశ్వసనీయ సమాచారం. ఈ అంశంపై స్పష్టత లేదు. కానీ ఏపీలో పరిస్థితుల్ని ఢిల్లీలో అందరి ముందు పెట్టాలని నారా లోకేష్ గట్టిగా నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. చంద్రబాబు కేసు విషయమై సుప్రీంకోర్టు న్యాయవాదులతో చర్చించే అవకాశం ఉంది. రాష్ట్ర పరిస్థితులు, కక్ష రాజకీయాల పై పార్లమెంట్లోనూ చర్చించేలా తెదేపా వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. దీనిపై పార్టీ ఎంపిలతో లోకేశ్ మాట్లాడనున్నారు. ఈ నెల 18 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్న విషయం విదితమే

# శవణ మాసం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డిసిసి ఉపాధ్యక్షుడు ముల్తానీ

(ఝరాసంగం ¯ మండలం లోని మచ్నూర్ గ్రామ లొ రామలింగేశ్వర దేవాలయం శ్రవణ మాసం ముగింపు కార్యక్రమం లో సంగారెడ్డి జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు ముహమ్మదు ముల్తాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథి రాచయ్య స్వామి కవి పెద్ద గొల్ల నారాయణ విశ్వనాధ్ స్వామి తో కలసి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గురు పటేల్ ఎం జగదీష్ యం గుండప్ప జగన్నాథం మారుతి నర్సింలు అశోక్ అంజయ్య నాగన్న వీరు పటేల్ శ్నోమర్ గ్రామ పెద్దలు గ్రామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హిందీ దివస్..

నారాయణ్ ఖేడ్) జుకల్ శివారులోని మహాత్మా జ్యోతి బాపులే స్కూల్ అండ్ కాలేజ్ లో గురువారం హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ప్రాముఖ్యతను టీచర్లు స్టూడెంట్స్ కి తెలియజేశారు. హిందీ మాట్లాడడం నేర్చుకుంటే దేశంలో ఎక్కడైనా జీవించవచ్చని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం హిందీ టీచర్ సుల్తాన్ ని సన్మానించారు. కార్యక్రమంలో ఏటిపి శివ శంకర్, హరీష్, శ్రీలక్ష్మి, మంగమ్మ, విజయ్ కుమార్, రాములు నాయక్, శ్రీనివాస్,సంజీవ్, బాలాజీ, అనిల్ కుమార్, గోవింద నాయక్, టీచర్లు స్టూడెంట్స్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయండి

**– కాట శ్రీనివాస్ గౌడ్**



బొల్లారం) సెప్టెంబర్ 17వ తేదీన హైదరాబాద్ తుక్కుగూడలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రామచంద్రాపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని విజయభేరి సభకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అరుణ్ గౌడ్ గారు సభ విజయవంతం చేయాలని పార్టీ పై అభిమానంతో లక్ష రూపాయల చెక్ ను కాట శ్రీనివాస్ గౌడ్ గారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కో ఆర్డినేటర్ శ్యామ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, పీసీసీ మెంబెర్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రెసిడెంట్లు సుధాకర్ గౌడ్, వడ్డె క్రిష్ణ, పుట్ట నర్సింగ్, టౌన్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, మున్సిపాలిటీ ప్రెసిడెంట్స్ శశిధర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సి ప్రభాకర్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్స్ ఈశ్వర్ సింగ్, శ్రీనివాస్, స్టేట్ ఎస్ సి సెల్ ప్రెసిడెంట్ నరసింహ, సంగారెడ్డి జిల్లా మైనారిటీ ప్రెసిడెంట్ హబీబ్ జానీ, సంగారెడ్డి జిల్లా ఓ బి సి సెల్ ప్రెసిడెంట్ మావీన్ గౌడ్, సంగారెడ్డి జిల్లా ఎస్ సి సెల్ ప్రెసిడెంట్ యాదగిరి, అసెంబ్లీ ఎస్ సి సెల్ ప్రెసిడెంట్ మహేష్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ అధ్యక్షులు, కె ఎస్ జి యువసేన సభ్యులు పాల్గొన్నారు.